పొంచి ఉన్న ప్రమాదాలు


నడిగూడెం నుంచి చాకిరాలకు వెళ్లే రోడ్డు వెంట రక్షణ వలయం లేని ట్రాన్స్‌ఫార్మర్


నడిగూడెంలో కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ తీగలు

- విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు కరువు
- పొలాల్లో చేతికందే ఎత్తులో వేలాడుతున్న కరెంట్‌ తీగలు
- పట్టించుకోని అధికారులు

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామాల్లో ప్రధాన, అంతర్గత రహదారులు, డొంక రోడ్ల వెంట గల విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలులేవు. పంట పొలాలు, ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్‌ తీగలు కిందికి వేలాడుతూ ఉన్నాయి. నడిగూడెం మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబల్లి, రత్నవరం గ్రామాల్లో ఇదే పరిస్థితి. దీంతో నిత్యం ఆయా రహదారుల గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

చేతికందే ఎత్తులో విద్యుత్‌ తీగలు..

అదేవిధంగా పలు గ్రామాల్లో విద్యుత్‌ స్తంభాలు ఒరిగి, తీగలు తలకు తగిలేంత ఎత్తులో ఉన్నాయి. పంట పొలాల్లో చేతులెత్తితే అందే ఎత్తులో విద్యుత్‌ తీగలు వేలాడుతున్నాయి. దీంతో వరి కోతల సమయంలో రైతులు అవస్థలు పడుతున్నారు. వరికోత మిషన్లు వచ్చినప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు వాపోతున్నారు. ఇక పలు గ్రామాల్లో విద్యుత్‌ స్తంభాలు లేకపోవడంతో పలువురు రైతులు కర్రలు ఏర్పాటు చేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. కాగా, గత రెండేళ్ల కాలంలో సిరిపురం, వల్లాపురం పలు గ్రామాల్లో విద్యుత్‌ తీగలు తగిలి అనేక పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. ఇప్పటికైనా విద్యుత్‌ అధికారులు స్పందించి విద్యుత్‌ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి



మా గ్రామ పరిధిలోని రైతుల పంట పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి రక్షణ వలయాలు లేవు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. గతంలో పలువురి పాడి గేదెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

– వేల్పుల సోమయ్య, వేణుగోపాలపురం

అధికారులు స్పందించాలి



నడిగూడెం నుంచి చాకిరాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంట రక్షణ వలయం లేకుండా విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ రహదారి అనేక వాహనాల్లో ప్రజలు రాకపోకలకు కొనసాగిస్తుంటారు. అలాగే పంట పొలాల్లో కూడా విద్యుత్‌ తీగలు వేలాడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలి.

– భోనగిరి ఉపేందర్, నడిగూడెం

అట్టహాసంగా పాఠశాల క్రీడా పోటీలు


నేరేడుచర్ల : జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ బచ్చలకూరి ప్రకాశ్‌

మఠంపల్లి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు శుక్రవారం రెండవ రోజు అట్టహాసంగా జరిగాయి. పోటీలను గురుకుల ప్రిన్సిపాల్‌ మంజుల ప్రారంభించారు. అండర్‌– 14 విభాగంలో కబడ్డీ విజేతగా రఘునాథపాలెం విద్యార్థులు, వాలీబాల్‌ విజేత మాంట్‌ఫోర్టు పాఠశాల, ఖోఖో పోటీలో విజేతగా గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారు. అండర్‌– 17 విభాగంలో కబడ్డీలో విజేతలుగా గురుకుల పాఠశాల మఠంపల్లి, వాలీబాల్‌లో సెయింటాన్స్‌ పాఠశాల మఠంపల్లి, ఖోఖో పోటీలో మఠంపల్లిలోని గురుకుల పాఠశాల విద్యార్థులు గెలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సెప్టెంబర్‌లో జరగనున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ చత్రునాయక్‌ తెలిపారు. కార్యక్రమంలో గురుకుల వైస్‌ ప్రిన్సిపాల్‌ వాణి, హెచ్‌ఎంలు శేషిరెడ్డి, మౌలానా, ఎస్‌జీఎస్‌ మండల సెక్రటరీ ఎస్‌.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పీఈటీలు బాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సునీత, నరేష్‌, శివనాగరాజు, జయ, నాగరాజు, వెంకటరత్నం, పరమేష్‌, సతీష్‌, ఉషారాణి, కాశీ, లక్ష్మి ముక్కంటి, వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.


మఠంపల్లి : కబడ్డీలో తలపడుతున్న బాలికలు

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడల పోటీలను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడతల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్‌ జిల్లా ఆర్గనైజింగ్‌ కార్యదర్శి అజాంబాబా మాట్లాడుతూ.. అండర్‌– 14, అండర్‌– 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశామని, వీరిని త్వరలో జరుగనున్న నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు గోవిందరెడ్డి, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నేరేడుచర్ల : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మున్సిపల్‌ చైర్మన్‌ బచ్చలకూరి ప్రకాశ్‌, మండల విద్యాధికారి ఛత్రునాయక్‌ అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రాంపురంలో గల బీసీ బాలుర గురుకుల పాఠశాలలో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నేరేడుచర్ల, పాలకీడు మండలాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్‌ కమిషనర్‌ అశోక్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఎల్‌.శ్రీనివాస్‌రావు, కాటయ్య, లింగయ్య, లూకాస్‌, పీడీలు యాదగిరి, ఏసుపాదం, శ్రీనివాస్‌, భాస్కర్‌, కవిత, ఉపాధ్యాయులు శివరాంరెడ్డి, సైదులు ఉన్నారు.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్న పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి పాఠశాల క్రీడలను మండల విద్యాధికారి సైదానాయక్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, నారపరెడ్డి, పాఠశాల గేమ్స్‌ నియోజకవర్గ సెక్రటరీ రవి, విశ్వబ్రహ్మచారి, ఉపేందర్‌, రంగారావు, నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, భసవయ్య, శ్యామ్‌, వెంకటయ్య, నరేందర్‌, భరత్‌ తదితరులు పాల్గొన్నారు.


మునగాల : క్రీడలను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు


మేళ్లచెరువు : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ సైదానాయక్‌

రేషన్‌ కార్డు లేని రైతులకూ రుణమాఫీ

నడిగూడెం : రేషన్‌ కార్డు లేని రైతులకు కూడా రుణమాఫీ అవుతుందని కోదాడ ఏడీఏ డి.యల్లయ్య తెలిపారు. మండలంలోని కరివిరాల రైతు వేదికలో రేషన్‌ కార్డు లేక రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, గ్రామంలో కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏఓ దేవప్రసాద్‌, ఏఈఓలు ఉప్పయ్య, పిచ్చయ్య, మౌనిక, రేణుక, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీకి 52 దరఖాస్తులు

మునగాల : రేషన్‌ కార్డు లేక రుణ మాఫీ కానిరైతుల కోసంమండలంలోని ఆకుపాముల, నరసింహాపురం, కోదండరామాపురం గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఓ రాజు మాట్లాడుతూ మూడు గ్రామాలలో 52 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. శనివారం ముకుందాపురం, బరాఖత్‌గూడెం, కృష్ణానగర్‌లలో సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు మేడిశెట్టి ఉషశ్రీ, మాచర్ల రమ్య తేజ, చిక్కుల భవాని, బాణోతు నాగు పాల్గొన్నారు.

వన భోజనాల మహోత్సవం

గరిడేపల్లి : శ్రావణమాసం సందర్భంగా గరిడేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రజలు వనభోజనాల మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి గ్రామ సమీప పొలాల వద్దకు వన భోజనాలకు వెళ్లారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో మాజీ చైర్మన్‌ బండ నర్సిరెడ్డిమాధవి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు విడుదల చేసి పంటలు కాపాడాలి

అర్వపల్లి: తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలు విడుదల చేసి ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని రైతు సంఘం డివిజన్‌ నాయకుడు వజ్జె శ్రీనివాస్‌ నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. సరైన వర్షాలు లేక రైతులు సాగు నీటి కొరతతో గత సీజన్‌లో కన్నా సగం మాత్రమే వరి పంటలు సాగుచేశారన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

నడిగూడెం : మండలంలోని కరివిరాల మోడల్‌ స్కూల్‌లో 9, 10 తరగతి విద్యార్థులు వృత్తి విద్య కోర్సులో పారిశ్రామిక సందర్శనలో భాగంగా శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర మెగా మార్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ ఎస్‌కే.షరీఫ్‌ మాట్లాడారు. పారిశ్రామిక పర్యటనలతో విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు మధు, విజయరాణి, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సిరాజుద్దీన్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన రేషన్‌ కార్డులు మంజూరు చేయాలి

పాలకవీడు : రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కొత్త రేషన్‌ కార్డులు మంజూరు కాలేదని, కాంగ్రెస్‌ ప్రభుత్వం చొరవ తీసుకుని అర్హులందరికీ రేషన్‌కార్డులు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎ.లక్ష్మి, ఏఐవైఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ పాఠశాల ఏర్పాటు చేయాలని వినతి


గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న మాలోతు మోతీలాల్‌

పాలకవీడు : హుజూర్‌నగర్‌ నియోజకవర్గంలో అత్యధిక గిరిజన జనాభా ఉండి, వెనుకబడిన ప్రాంతం అయిన పాలకవీడు మండలంలో గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్‌ పాఠశాల ఏర్పాటు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకుడు, తాజా మాజీ జెడ్పీటీసీ మాలోతు మోతీలాల్‌ కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఎ.శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత విద్యార్థుల సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శిని అభ్యర్థిస్తూ సిఫారసు లేఖ అందించారని, తాను ఆ లేఖను ముఖ్య కార్యదర్శికి తాను అందజేసినట్లు తెలిపారు. దీంతో పాఠశాల ఏర్పాటుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విష జ్వరాల నుంచి కాపాడాలి


మాట్లాడుతున్న హుస్సేన్‌

హుజూర్‌నగర్‌రూరల్‌ : అంటు వ్యాధులు, విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్‌ కోరారు. మండలంలోని అమరవరంలో విష జ్వరాల బారిన పడిన వారిని ఆయన శుక్రవారం పరామర్శించి మాట్లాడారు. గత నెల రోజులుగా విష జ్వరాలు ప్రబలి డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌, చికున్‌గున్యా జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నివారించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, శానిటేషన్‌ చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. తక్షణమే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ఆయన డిమాండ్‌ చేశారు. పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి షేక్‌ ఖాసీం, సైదా, సీతారాములు, గోవింద్‌, పున్నయ్య, సౌభాగ్యమ్మ, వెంకన్న, బాలసైదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొదుపు సంఘాల సభ్యులకు విత్తనాలు పంపిణీ

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో ఇటీవల సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ పొందిన 30 మంది పొదుపు సంఘాల సభ్యులకు శుక్రవారం కరివిరాలకు చెందిన గుమ్మడిదల శివ సహకారంతో సిరి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పెరటి తోటల పెంపకం కోసం ఉచితంగా కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరి ఫౌండేషన్‌ ప్రతినిధి గంటెపంగు నాగరాజు, పొదుపు సంఘాల సభ్యులు దొంతగాని పుల్లమ్మ, కళమ్మ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక


ఊట్కూర్‌ వెంకటరెడ్డి


ఎం.కిరణ్‌

మోతె : మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఊట్కూర్‌ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.కిరణ్‌, అసోసియేట్‌ అధ్యక్షుడిగా కె.కృష్ణయ్య, కార్యదర్శిగా డి.రమేష్‌, మహిళా ఉపాధ్యక్షురాలిగా మర్కాల మంజుల, మహిళా కార్యదర్శిగా ఎస్‌.శ్రీదేవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌, కార్యదర్శి రామలింగారెడ్డి, తంగెళ్ల జితేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ఆలయ భూములు కాపాడాలి

మునగాల : హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్యాక్రాంతమైన ఆలయ భూములను కాపాడాలని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్‌ వేమూరి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆలయ భూములు వేల ఎకరాల్లో కబ్జాకు గురై నామమాత్రపు కౌలు కూడా రాకపోవడంతో పురాతన దేవాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆక్రమణకు గురైన దేవాలయాలను కాపాడేందుకు హైడ్రా తరహాలో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఒక సీనియర్‌ అధికారి పర్యవేక్షణలో ఆలయ భూములను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని సత్యనారాయణ కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్మన్‌

హుజూర్‌నగర్‌ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గెల్లి అర్చన రవి, వైస్‌ చైర్మన్‌ కోతి సంపత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ ఓరుగంటి నాగేశ్వరరావు, సులువ చంద్రశేఖర్‌, లబ్ధిదారులు బుడిగ భారతమ్మ, దగ్గుపాటి రాణి, గడ్డం ఉమ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి


పెదవీడులో మాట్లాడుతున్న శీలం శ్రీను

మఠంపల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్‌ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. శుక్రవారం మండలంలోని పెదవీడులో జరిగిన గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్‌ (సీఐటీయూ అనుబంధ సంఘం) మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బతుకులు మారతాయని కలలు కన్న కార్మికులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్‌ రసమియా, పంచాయతీ కార్మికుల యూనియన్‌ మండల అధ్యక్షుడు సైదానాయక్‌, సభ్యులు అంజయ్య, గురువారెడ్డి, దేవదానం, రహీం, రవి, సంతోషం, నాగలక్ష్మి, పాండు, బాల, సూరి, సత్తయ్య, కోటేశ్వరరావు, నాగుల్‌ మీరా, కోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్‌ : పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల ఎన్నెస్పీ కెనాల్‌ వద్ద ఉన్న విద్యుత్‌ టవర్‌ మార్చుతున్నందున శనివారం హుజూర్‌నగర్‌లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌ ఏఈ రాంప్రసాద్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు, సీతారాంనగర్‌, శివారెడ్డి బజార్‌, చింతల బజార్‌ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

‘ఓపెన్‌’ విద్యార్థులకు ఉపకార వేతనాలు

- అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ధర్మానాయక్‌


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ ధర్మానాయక్‌

హుజూర్‌నగర్‌ : డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ ద్వారా దూర విద్యను అభ్యసించే ఎస్సీ ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాలు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆ యూనివర్సిటీ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ధర్మానాయక్‌ తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఓపెన్‌ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహిణులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు దూర విద్య ద్వారా వారి ఉన్నత విద్యా లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. తక్కువ ఫీజుతో ఉన్నత విద్యను పొందేందుకు ఓపెన్‌ యూనివర్సిటీ ద్వారా మంచి అవకాశం ఉన్నదని చెప్పారు. అడ్మిషన్లు పెంచేందుకు మీడియా, సోషల్‌ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని స్టడీ సెంటర్‌ కోఆర్డినేటర్‌కు ఆయన సూచించారు. నాణ్యమైన విద్యా బోధనకు స్టడీ సెంటర్‌ కౌన్సిలర్స్‌ కృషి చేయాలన్నారు. దూరవిద్య ప్రవేశాల్లో హుజూర్‌నగర్‌ స్టడీ సెంటర్‌ ఎప్పుడూ ముందంజలో ఉందన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ సుధారాణి ఫోన్‌ ద్వారా స్టడీ సెంటర్‌ కౌన్సిలర్స్‌తో మాట్లాడారు. సమావేశంలో యూనివర్సిటీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ సునిత, ప్రిన్సిపాల్‌ బి.శ్రీనివాస్‌, కోఆర్డినేటర్‌ ఎస్‌.బాలరాజు, జాక్టో సైదానాయక్‌, కౌన్సిలర్స్‌ రామారావు, ప్రియాంక, డాక్టర్‌ నగేష్‌, నాగార్జున, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనసూర్యమ్మ ఆశయ సాధనకు కృషిచేయాలి


అనసూర్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మునగాల : తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచేవరకు కమ్యూనిస్టుగా బతికి పార్టీ కోసం కుటుంబాన్ని త్యాగం చేసిన ముదిరెడ్డి అనసూర్యమ్మ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. మండలంలోని నర్సింహులగూడెంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన సీపీఎం సీనియర్‌ నాయకురాలు ముదిరెడ్డి అనసూర్యమ్మ దశదిన కర్మ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నర్సింహులగూడెంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి అనసూర్యమ్మ ఎనలేని కృషిచేసిందని తెలిపారు. అనసూర్యమ్మ మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి సీపీఎం రాష్ట్ర కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదిర్శ వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, పల్లె వెంకటరెడ్డి, వట్టెపు సైదులు, మిట్టగడుపుల ముత్యాలు, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, నాయకులు రాపోలు సూర్యనారాయణ, జూలకంటి కొండారెడ్డి, జూలకంటి విజయలక్ష్మి, హుస్సేన్‌, బచ్చలకూరి స్వరాజ్యం, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు


శాకాంబరీ అవతారంలో అమ్మవారు


గరిడేపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

మునగాల : శ్రావణ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకొని మండలంలోని రేపాల గ్రామ శివారులో గల స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు చెవులూరి రామకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్‌ సారిక చినరామయ్య దంపతులు పాల్గొన్నారు. మండలంలోని పలు దేవాలయాల్లోనూ పూజలు చేశారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని రామాలయం, గుండాలమ్మ తల్లి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయాల పూజారులు సుదర్శనం, శ్రీనివాసాచార్యులు, రాజనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


మునగాల : రేపాలలో పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్‌ దంపతులు

శాకాంబరీ దేవిగా కనకదుర్గ అమ్మవారు

నేరేడుచర్ల : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా నేరేడుచర్ల పట్టణంలోని విజయదుర్గ ఆలయంలో శ్రీకనకదుర్గ అమ్మవారు శాకాంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ములుగు శ్రీనివాసాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ పండుగ

హుజూర్‌నగర్‌రూరల్‌ : మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో శుక్రవారం కనకదుర్గమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో కనకదుర్గమ్మ ఆలయానికి తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌, హుజూర్‌నగర్‌ బ్లాక్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌ దేశ్‌ముఖ్‌, రాధికా దేశ్‌ముఖ్‌, అఖిల పక్షం నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


నేరేడుచర్ల : సోమారంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి


నడిగూడెం : వేణుగోపాలపురంలో ఫీవర్‌ సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ ఇమామ్‌

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నేరేడుచర్ల మండలం సోమారం గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి రమేష్‌ తదితరులు ఉన్నారు.

నేరేడుచర్లలో ఫీవర్‌ సర్వే

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నేరేడుచర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం ఇంటింటి ఫీవర్‌ సర్వే నిర్వహించారు. 11వ వార్డులో వార్డు ఆఫీసర్‌ పెండెం పాపయ్య, ఆశా వర్కర్‌ యడవల్లి మంజుల ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. సీజనల్‌ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైన జ్వరం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

వేణుగోపాలపురంలో..

నడిగూడెం : ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్‌ సూచించారు. శుక్రవారం నడిగూడెం మండలంలోని వేణుగోపాలపురంలో నిర్వహించిన ఫీవర్‌ సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సుదర్శన్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎం శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుకూరులో డ్రైడే

చిలుకూరు : గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా చిలుకూరులో జీపీ, వైద్య సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. వీధుల్లో నిల్వ నీటిని తొలగించారు. ఇంటింటికీ తిరిగి ఫీవర్‌ సర్వే చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్‌, బిల్‌ కలెక్టర్‌ ధర్మయ్య గౌడ్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ శ్రీనివాస్‌, వైద్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.